గుమ్మడవెల్లి గ్రామంలో మాజీ వార్డు మెంబర్ జలగం అంజమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే కిశోర్ పరామర్శ

మద్దిరాల/సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 18 : మండలంలోని చిననెమిల గ్రామానికి చెందిన మాజీ కో-ఆప్షన్ సభ్యుడు షేక్ సాహెబ్‌హుస్సేన్ అనారోగ్యానికి గురై సూర్యాపేటలో విశ్రాంతి తీసుకుంటుండగా మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ మంగళవారం ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా గుమ్మడవెల్లి గ్రామంలో మాజీ వార్డు మెంజర్ జలగం అంజమ్మ ఇటీవల మరణించగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎస్ఏ రజాక్, మాజీ వైస్ ఎంపీపీ బెజ్జెంకి శ్రీరాంరెడ్డి, మాజీ సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, సూరారపు రాజు, తిర్మల్‌రావు, లావుడ్య వెంకన్న, మురళి, రమేశ్ ఉన్నారు. మండలంలోని తూర్పతండా మాజీ సర్పంచ్ భూక్యా లక్ష్మీవీరన్న కుమారుడు నేహాంత్ రామ్ అన్నప్రసన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కిశోర్ హాజరై ఆశీర్వదించారు.

గురుకుల పాఠశాలలో నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

గురుకులంలో వార్షికోత్సవ సంబురాలు

నేరేడుచర్ల, ఫిబ్రవరి 18 : మండలంలోని చిల్లేపల్లి గ్రామంలో గల మహాత్మా జ్యోతిబా పూలే సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం వార్షికోత్సం, వీడ్కోలు సమావేశాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం, పదో తరగతి విద్యార్థులు వారి అనుభూతులు, అనుభవాలను తోటి విద్యార్థులు, అధ్యాపకులతో గుర్తు చేసుకున్నారు. అనంతరం తెలంగాణలోని భిన్న సంస్కృతులను తెలియజేసే విధంగా ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తాసీల్దార్ సురగి సైదులు, ఎస్ఐ రవీందర్, ఎంఈఓ సత్యనారాయణ రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అనుకరణ, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ సుజాత, డిప్యూటీ వార్డెన్ స్వాతి, అధ్యాపకులు ఉన్నారు.

శ్రీవాణి పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ తిలకిస్తున్న ఎంఈఓలు

సాంకేతిక విద్యా ప్రదర్శన

నేరేడుచర్ల, ఫిబ్రవరి18 : పట్టణంలోని శ్రీవాణి పాఠశాలలో మంగళవారం విద్యార్థులతో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యం పెంపొందించే విధంగా యులిప్స్ అంతర్జాతీయ విద్యా రంగ సంస్థ ద్వారా గత ఆరు నెలలుగా కంప్యూటర్ ఆధారిత సాంకేతిక విజ్ఞానాన్ని అందించడానికి శిక్షణ ఇచ్చారు. దీని ద్వారా వివిధ రంగాల్లో శిక్షణ పొందిన విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకున్నది మొదట యులిప్స్ దర్బార్, సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభ సమావేశంలో నేరేడుచర్ల, పాలకవీడు, గరిడేపల్లి ఎంఈఓలు సత్యనారాయణ రెడ్డి, కాటయ్య, ఛత్రూనాయక్ జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కొణతం సీతారాంరెడ్డి, యులిప్స్ జీఎం అభిషేక్ గంగులీ, ఆర్ఎం సుప్రియ, ప్రతినిధి శ్రీకాంత్, ప్రిన్సిపాల్ చారి, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

బాట కబ్జా.. న్యాయం చేయాలని ఆందోళన

కబ్జా స్థలం వద్ద నిరసన తెలుపుతున్న బాధిత కుటుంబ సభ్యులు

కోదాడ రూరల్, ఫిబ్రవరి 18 : మండలంలోని గణపవరంలో బాటను కబ్జా చేసి తిరిగి బాధితులనే బెదిరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వారు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన సర్వే నంబర్ 430లో 1988లో అప్పటి ప్రభుత్వం మాల కులస్తులకు స్థలాలు మంజూరు చేసి పట్టాలు అందించింది. ఆ స్థలంలో పప్పుల పాపమ్మ అనే మహిళ ఇల్లు నిర్మించుకున్నది. మాలవాడలోని కొన్ని ప్లాట్లను ఇతర కులస్తులు కొనుగోలు చేసి వీరి ఇంటికి ఉన్న బాటలో ఫెన్సింగ్ వేసి పశువులను కట్టి రాకపోకలు లేకుండా ఆక్రమించుకున్నారు. ఏంటని ప్రశ్నిస్తే బెదిరింపులకు గురి చేస్తున్నారని వారు ఆరోపించారు. దీంతో చేసేది లేక స్థానికులు మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ అప్పటి సర్పంచ్ గ్రామంలోనే ఉన్నారని, బాట ఉన్నది, లేనిది ఆయనకు కూడా తెలుసని ఎంత చెప్తున్నా వినకుండా బాటను కబ్జా చేశారని ఆరోపించారు. సంబంధిత అధికారులు విచారణ జరిపి న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. నిరసనలో పప్పుల వెంకటేశ్వర్లు, ఏసోబు, పెద్దమాల గాంధీ, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

తిరుమలగిరి, ఫిబ్రవరి 18 : మండల కేంద్రంలో మంగళవారం రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. గుంటూరు నుంచి కరీంనగర్‌కు కొబ్బరి బొండాలతో వెళ్తున్న టాటా ఏస్ వాహనం తిరుమలగిరి మండల కేంద్రంలోని తెలంగాణ చౌరస్తా వద్ద తెల్లవారు జామున అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో వాహనంలోని ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో సూర్యాపేట ఏరియా దవాఖానాకు తరలించారు. అదే విధంగా సూర్యాపేట రోడ్డులో కారు అదుపు తప్పి రోడ్డు కిందికి దూసుకెళ్లడంతో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి.

పశువైద్యశాలకు కిటికీ అందజేత

కోదాడ రూరల్, ఫిబ్రవరి 18 : కోదాడ ప్రాంతీయ పశువైద్యశాలకు పట్టణానికి చెందిన తుమాటి సురేశ్‌రెడ్డి రూ.13వేలు విలువచేసే కిటికీని మంగళవారం బహూకరించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ డైరెక్టర్ పి.పెంటయ్య మాట్లాడుతూ వైద్యశాల బలోపేతానికి దాతల సహకారం అభినందనీయమన్నారు.

బీసీలకు పదవులు కల్పించాలి : లింగయ్య యాదవ్

నూతనకల్, ఫిబ్రవరి 18 : కాంగ్రెస్ పార్టీ పదవుల్లో బీసీలకు అవకాశం కల్పించాలని ఆ సంఘం నేత వీరబోయిన లింగయ్యయాదవ్ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 50 శాతం ఉన్న బీసీలను కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు అనగ దొక్కుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు మండల స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు బీసీలకు సమన్యాయం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను చిన్న చూపు చూస్తే గాంధీ భవన్ ముట్టడి చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు వేల్పుల రఘు, సాయి, రాజేశ్, వీరు, లక్ష్మణ్‌కుమార్, సిద్ధు ఉన్నారు.

లింగమంతులస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమా భరత్‌కుమార్‌గుప్తా, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు బొల్లం మల్లయ్య యాదవ్, నోముల భగత్ కుమార్, బీఆర్ఎస్ నేత దూదిమెట్ల బాలరాజు యాదవ్ తదితరులు

రూ.14 కోట్లతో పెద్దగట్టును అభివృద్ధి చేశాం

- నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని ఖర్చు చేసిందో చెప్పాలి?
- జాతరలో పారిశుధ్యం పడకేసింది
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్
- పెద్దగట్టులో మాజీ ఎమ్మెల్యేలతో కలిసి పూజలు

సూర్యాపేటటౌన్/చివ్వెంల, ఫిబ్రవరి 18 : పెద్దగట్టు అభివృద్ధి బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలోనే జరిగిందని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. దురాజ్‌పల్లి పెద్దగట్టు లింగమంతులస్వామి జాతరకు మంగళవారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలతో కలిసి పాల్గొని ఆయన ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. సమ్మక్క సారక్క జాతర తరువాత రాష్ట్రంలో జరిగే రెండో అతి పెద్ద జాతర ఇదేనన్నారు. రెండేళ్లకోసారి జరిగే ఈ జాతరకు లక్షలాది మంది భక్తులు హాజరవుతారన్నారు.

భక్తులను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కేసీఆర్ రూ.14కోట్లు మంజూరు చేసి అనేక అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించినట్లు గుర్తు చేశారు. ఈ ఏడాది జాతర నిర్వహణకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేసినట్లు ప్రకటించిందని.. వాటిలో ఎన్ని నిధులు ఖర్చు చేశారో చెప్పాలని ప్రశ్నించారు.

ఏర్పాట్లు సక్రమంగా లేవని, పారిశుధ్య నిర్వహణ లేక దుర్వాసనతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నెల 20వరకు జాతర జరుగుతుందని, ఇప్పటి నుంచైనా భక్తులకు ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ మాజీ మంత్రిని, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలను సన్మానించి జ్ఞాపికలను అందించారు. ఆయన వెంట మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమా భరత్‌కుమార్‌గుప్తా, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, బొల్లం మల్లయ్యయాదవ్, నోముల భగత్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్, యాదవ సంఘాల నాయకులున్నారు.

మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి – లక్ష్మీమల్లయ్య

నూతనకల్, ఫిబ్రవరి 18 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని మాజీ ఎంపీటీసీ సభ్యురాలు మున్న లక్ష్మీ మల్లయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ నేతలు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి మహిళకు రూ.2500, కల్యాణలక్ష్మి, తులం బంగారం, మహిళా సంఘాలకు వడ్డీ లేకుండా రూ.10 లక్షలు ఇస్తామని ఇచ్చిన హామీలు ఇప్పటి వరకు అమలు చేయలేదని ప్రశ్నించారు. బాలింతలకు కేసీఆర్ కిట్లను అందించకపోవడం బాధాకరమన్నారు. మహిళలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి మోసపోయామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మహిళలు తగిన బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో అమ్మక్క, పుల్లమ్మ, సుమిత్ర, అనిత, మమత ఉన్నారు.

చిన్నారులను భుజాలపై ఎత్తుకున్న భక్తులు, కిక్కిరిసిన జనం

జాతరలో తోపులాట

చివ్వెంల, ఫిబ్రవరి 18 : పెద్దగట్టు జాతరలో పోలీసులు, మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యంతో మర్రిచెట్టుకు సమీపంలో తోపులాట జరిగింది. మంగళవారం సాయంత్రం భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. అదే సమయంలో చెత్త సేకరణ ట్రాక్టర్ రావడంతో ఒక్కసారిగా ఒకరినొకరు తోసుకున్నారు. దీంతో చిన్నారులకు ఊపిరాడక ఇబ్బందులు పడడంతో తల్లిదండ్రులు వారిని భుజాలపై ఎత్తుకున్నారు. తోపులాట సమయంలో అదుపు చేయడానికి ఘటనా స్థలంలో ఒక్క పోలీస్ కూడా లేకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు పవిత్ర

పవిత్ర

కోదాడ రూరల్, ఫిబ్రవరి 18 : రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు అండర్-16 విభాగంలో స్థానిక బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని పవిత్ర ఎంపికైనట్లు కోచ్ ఎస్‌కే బాగ్దాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల హుజూర్‌నగర్ మండల రాయినిగూడెంలో నిర్వహించిన అండర్ - 16 కబడ్డీ జిల్లా జట్టు ఎంపికలో పవిత్ర ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈనెల 20 నుంచి 23 వరకు వికారాబాద్‌లో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈమె పాల్గొంటారని తెలిపారు.

నర్సరీల నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

వీర్లపాలెంలో నర్సరీని పరిశీలిస్తున్న శేఖర్‌రెడ్డి

దామరచర్ల, ఫిబ్రవరి18: నర్సరీల నిర్వాహణ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఆర్‌డీఓ వై. శేఖర్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని దామరచర్ల, బెట్టతండా, ఇర్కిగూడెం, తాళ్ల వీరప్పగూడెం, వీర్లపాలెం, పర్తూనాయక్ తండాల్లోని నర్సరీలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఇర్కిగూడం నర్సరీ అధ్వాన్నంగా ఉండటంతో అసహనం వ్యక్తం చేశారు. షేడ్‌నెట్లు ఏర్పాటు చేయాలని, నీటి కొరత లేకుండా చూసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ శ్రీనివాసమూర్తి, ఏపీఓ నాగేశ్వరరావు, ఏపీఎం శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

సాగు చేయని భూములను గుర్తించాలి

- జిల్లా వ్యవసాయ అధికారి శ్రావణ్‌కుమార్

శాలిగౌరారం, జనవరి 18 : రైతులు సాగు చేయని భూముల వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి పాల్వాయి శ్రావణ్‌కుమార్ ఆదేశించారు. శనివారం మండలంలోని వల్లాల గ్రామంలో రైతు భరోసా కోసం చేపడుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సర్వేను గడువు లోపు పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి సౌమ్యశృతి, ఏఈఓ శ్రావణ్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయాలి

- హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న రాజ్‌కుమార్

కట్టంగూర్, ఫిబ్రవరి 18 : ఇటీవల నిర్వహించిన సర్వే ఆధారంగా ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల్లో అర్హుల జాబితాను సిద్ధం చేయాలని గృహ నిర్మాణశాఖ పీడీ ఎస్‌పీ.రాజ్‌కుమార్ అధికారును ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 20 నాటికి అన్ని గ్రామాలకు సంబంధించి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితా తయారు చేయడంతో పాటు నమూనా ఇంటి నిర్మాణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. లబ్ధిదారులకు అందించే రూ.5లక్షల ఆర్థికసాయం నాలుగు విడుతలుగా చెల్లిస్తారనే విషయాన్ని లబ్ధిదారులకు వివరించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్‌రావు, ఎంపీఓ చింతమల్ల చలపతి, పంచాయతీ కార్యదర్శులు వడ్ల కొండ అశోక్, శ్రీధర్‌రెడ్డి, జయసుధ, రేణుక, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

నిబంధనల మేరకు గుర్తించాలి

మిర్యాలగూడ రూరల్ : నిబంధనలను అనుసరించి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను గుర్తించాలని ఎంపీడీఓ శేషగిరి శర్మ సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో ఎంపీఓ మాతంగి రమేశ్, ఏపీఓ మాచర్ల కళావతి, ఫీల్డ్ అస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న బీఆర్ఎస్ యువజన నాయకుడు సంతోశ్‌యాదవ్

మర్రిగూడ, ఫిబ్రవరి18 : కేసీఆర్ జన్మదినం సందర్భంగా మండలంలోని యరగండ్లపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు బీఆర్ఎస్ యువజన నాయకుడు వల్లంల సంతోశ్‌యాదవ్ మంగళవారం స్టడీ మెటీరియల్ అందించారు. సోమవారం సెలవు కావడంతో మంగళవారం అందించినట్లు తెలిపారు.

స్థల సేకరణ ఆపాలని హైకోర్టు ఉత్తర్వులు

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 17: పట్టణంలో ఫణిగిరి గట్టు వద్ద 529, 540, 541, 542 సర్వే నంబర్లలో గల 25 ఎకరాల భూమిని 2012లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 979 ప్లాట్లుగా విభజించి పేదలకు 70 గజాల చొప్పున పంపిణీ చేసింది. వాటిలో కొన్ని 140 గజాల చొప్పున కొంత మంది జర్నలిస్టులకు పంపిణీ చేశారు. ఇదిలా ఉండగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి గత ఎన్నికల్లో న్యాయవాదులకు వసతి గృహాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఫణిగిరి గట్టు వద్ద అధికారులు స్థలాన్ని సేకరిస్తున్నారు. కాగా ప్రభుత్వం కేటాయించిన స్థలంలో జర్నలిస్టుల స్థలాలు కూడా ఉండగా అందులో కొంతమంది ఇండ్ల నిర్మాణం కూడా చేపట్టారు. వాటిని తొలగించాలని అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో జర్నలిస్టులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో స్థల సేకరణ నిలిపి వేయాలని హైకోర్టు మంగళవారం స్టే జారీ చేసింది.

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు

నల్లగొండ సిటీ, ఫిబ్రవరి 18: కనగల్‌లోని ఆదర్శ పాఠశాలో 2025-2026 విద్యా సంవత్సరంలో 6 నుంచి 10వ తరగతిలో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ థామస్‌అయ్య తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 6వ తరగతిలో 100 సీట్లు, 7 నుంచి 10వ తరగతి వరకు మిగిలి ఉన్న సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

రైతు సంఘం మండల కార్యవర్గం ఎన్నిక

చిట్యాల, ఫిబ్రవరి 18 : రైతు సంఘం మండల కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు తెలిపారు. అధ్యక్షుడిగా బొబ్బలి సుధాకర్‌రెడ్డి, కార్యదర్శిగా అరూరి శ్రీను, ఉపాధ్యక్షులుగా లడే రాములు, సుర్కంటి మోహన్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా మెట్టు నర్సింహ, ఉయ్యాల సత్తయ్య, కోశాధికారిగా రూపని ఇద్దయ్య ఎన్నికయ్యారు.

మునుగోడు ఎంఈఓగా మల్లేశం

మునుగోడు, ఫిబ్రవరి18 : మునుగోడు మండల విద్యాశాఖ అధికారిగా కొరటికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.మల్లేశం మంగళవారం స్థానిక విద్యావనరల కేంద్రంలో బాధ్యతలు చేపట్టారు. ఉపాధ్యాయులు సత్కరించారు.

ఎస్ఐ పేరుతో ఫోన్‌చేసి.. రూ.5వేలు టోకరా

చందంపేట(దేవరకొండ), ఫిబ్రవరి 18: ఎస్ఐ పేరుతో మీసేవా కేంద్రం నిర్వాహకుడికి గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి రూ.5వేలు వసూలు చేసిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. దేవరకొండ పట్టణంలో మీ సేవా కేంద్రం నిర్వహిస్తున్న జగపతిబాబుకు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి తాను ఎస్ఐని అని అర్జెంటుగా రూ.5వేలు ఫోన్ పే చేయాలని కోరాడు. దాంతో కంగారు పడిన జగపతిబాబు అతను సూచించిన నంబర్‌కు రూ.5వేలు ఫోన్ పే చేశాడు. తర్వాత సదరు నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దాంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ నర్సింహులు తెలిపారు.

ఆర్థిక సాయం

మిర్యాలగూడ, ఫిబ్రవరి 18: వేములపల్లి మండలంలోని మొల్కపట్నం గ్రామానికి చెందిన రెమడాల సైదులు అనారోగ్యంతో బాధపడుతూ మిర్యాలగూడ పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బీఆర్ఎస్ వేములపల్లి మండలాధ్యక్షుడు నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి మంగళవారం సైదులును పరామర్శించి, రూ.5వేల ఆర్థిక సాయం అందించారు.

మోతెకు సాగునీరు పోనివ్వకుండా ఎస్సారెస్పీ గేటు వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

సాగునీటి కోసం అధికారులతో రైతుల ఘర్షణ

ఆత్మకూర్.ఎస్, ఫిబ్రవరి 18 : మండల పరిధిలోని కోటినాయక్‌తండా వద్ద రైతులు ఎస్సారెస్పీ కాల్వ గేటు విషయంలో మరోసారి అధికారులతో ఘర్షణకు దిగారు. సాగునీటిని మోతెకు తరలిస్తున్నారని పెద్దఎత్తున వచ్చి అధికారులతో వాగ్వాదానికి దిగారు. తమ పంట పొలాలు ఎండిపోతున్నాయని మండిపడుతూ కాల్వకు అడ్డంగా రాళ్లు, బస్తాలు వేసి నీళ్లు పోనియ్యకుండా అడ్డుకట్ట వేశారు.

అధికారులు స్పందిస్తూ తమ చేతుల్లో ఏమీ లేదని, ప్రభుత్వం ఏం చేస్తే తాము అది చేస్తామని చెప్పడంతో చేసేది లేక రైతులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

కుక్కడం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో మరుగుదొడ్ల నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ, సీడీపీఓ

అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీఓ సందర్శన

మద్దిరాల, ఫిబ్రవరి 18 : మండలంలోని కుక్కడం, పోలుమల్ల గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీఓ సత్యనారాయణ రెడ్డి, సీడీపీఓ శ్రీజ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు మరుగుదొడ్లు మంజూరు కాగా స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఉన్నారు.

ఎఫ్‌డీ పత్రాలను హుస్సేన్ కుటుంబ సభ్యులకు అందిస్తున్న స్నేహితులు

ఆర్థిక సాయం

నడిగూడెం, ఫిబ్రవరి 18 : మండల పరిధిలోని సిరిపురం గ్రామానికి చెందిన సయ్యద్ హుస్సేన్ (38) ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. హుస్సేన్‌తో 1997-98లో పదో తరగతి కలిసి చదివిన తోటి స్నేహితులందరు కలిసి రూ.40 వేలు సమీకరించి హుస్సేన్ పిల్లల పేరు మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. సంబంధిత బాండ్ పత్రాలను మంగళవారం కుటుంబ సభ్యులకు వారు అందించారు.

టీబీ రహిత తెలంగాణే లక్ష్యం

మాట్లాడుతున్న మండల వైద్యాధికారి నరేశ్

గరిడేపల్లి, ఫిబ్రవరి 18 : రాష్ట్రాన్ని టీబీ రహిత తెలంగాణగా మార్చడమే లక్ష్యంగా పని చేయాలని మండల వైద్యాధికారి వి.నరేష్ అన్నారు. 100రోజుల నిక్షయ్ శివిర్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం గరిడేపల్లిలో క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరంలో 44మందికి తెమడ పరీక్షలు, 103మందికి ఎక్స్‌రే తీసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ శారద, సూపర్‌వైజర్ అంజయ్యగౌడ్, వైద్యసిబ్బంది అశోక్‌సాయి, మమత, ఉపేందర్, కవిత, అంజలి, తదితరులున్నారు.

కల్వలపల్లివాసికి ఓయూ డాక్టరేట్

మునుగోడు, ఫిబ్రవరి18 : మునుగోడు మండలం కల్వలపల్లి గ్రామానికి చెందిన శ్రవణ్‌కుమార్‌కు ఓయూ విశ్వవిద్యాలయం డాక్టరేట్ అందించింది. ఓయూ ప్రొఫెసర్ మంగు ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో విభాగంలో 'పవర్ క్వాలిటీ మెరుగుదల రియాక్టివ్ పవర్ మేనేజ్‌మెంట్ హైబ్రిడ్ ఫిల్టర్ పనితీరు విశ్లేషణ' అంశంపై చేసిన పరిశోధనకు ఆయనకు ఓయూ డాక్టరేట్ అందించింది. శ్రవణ్‌కుమార్ ఓయూ నుంచి డాక్టరేట్ పొందడంపై గ్రామస్తులు, బంధువులు హర్షం వ్యక్తం చేశారు.